సాక్షి
వికారాబాద్
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు

కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు చేకూరుతుందని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారెడ్డి అన్నారు. 10లో▸



కలప అక్రమ రవాణా

ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు పొలాల్లో చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తూ అక్రమ రవాణా చేస్తున్నారు. 10లో▸



అపురూపం

దేవీ నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారు సోమవారం బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. 11లో▸

న్యూస్‌రీల్

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

డీఎస్పీ శేఖర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

యాలాల: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ హెచ్చరించారు. సోమవారం యాలాల పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ అరవింద్‌కుమార్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభలు, సమావేశాలు, ర్యాలీల కోసం సువిధ యాప్‌లో 48 గంటల ముందే దరఖాస్తు చేసుకోవాలని, గంటల వ్యవధిలో వాటిని పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు లేకుంటే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో తాండూరు రూరల్ సీఐ రాంబాబు, తహసీల్దార్ మునీరొద్దీన్, ఎంపీడీఓ పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



గొంగుపల్లిలో పత్తి పంటను పరిశీలిస్తున్న గోపాల్ తదితరులు

పూడూరు: సస్యరక్షణ చర్యలు చేపట్టి పత్తి, మొక్కజొన్న పంటలను కాపాడుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని గొంగుపల్లిలో కంది, పత్తి పంటలను పరిశీలించి పేనుబంక అధికంగా ఉండడాన్ని గుర్తించారు. కంది పంటకు లద్దె పురుగు ఆశించిందని, నివారణకు ఇమామెక్టిన్ బెంజోట్, అసిఫేట్ పౌడర్‌ను పిచికారీ చేయాలని సూచించారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

భక్తితోనే ముక్తిమార్గం

భవానీమాత ఆలయ పీఠాధిపతి శంకర్ స్వామిజీ



బ్రహ్మచారిని అలంకరణలో భవానీమాత

బషీరాబాద్: భక్తి మార్గంతో మనిషికి ముక్తిమార్గం లభిస్తుందని దామర్‌చెడ్ అంబా భవానీ మాత ఆలయ పీఠాధిపతి, తెలంగాణ సాధూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ శంకర్ స్వామిజీ అన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భవానీ మాత బ్రహ్మచారిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి ప్రవచనాలు బోధించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే శుభాలు కలుగుతాయన్నారు. ప్రతీ ఒక్కరూ భక్తిభావం అలవరచుకోవాలని సూచించారు. అనంతరం అన్నదానం చేశారు.

రూ.2.5 లక్షల పట్టివేత



కొడంగల్ రూరల్: మండలంలోని రావులపల్లి చెక్‌పోస్టు వద్ద సోమవారం పోలీసులు ఓ వ్యక్తి నుంచి రూ. 2.50లక్షలు స్వాదీనం చేసుకున్నా రు. బొంరాస్‌పేట మండలానికి చెందిన ఓ వ్య క్తి కర్ణాటక నుంచి కొడంగల్‌కు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. రావులపల్లి చెక్‌పోస్టు వద్ద అతని వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా రూ. 2.50లక్షలు లభించాయి. నగదుకు సంబంధించిన సరైన వివరాలు చెప్పకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపారు.

ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఓటరు నమోదు కోసం ట్రాన్స్‌జెండర్స్ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి పద్మజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17న మహిళా శక్తి కేంద్రం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన సరూర్‌నగర్‌లో ట్రాన్స్‌జెండర్ ఓటరు నమోదు, సర్టిఫికెట్, ఐడీ కార్డు జారీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, ఇతర అడ్రస్ ప్రూఫ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాల్సిందిగా సూచించారు. ట్రాన్స్‌జెండర్స్ సర్టిఫికెట్ కోసం నోటరీ చేయించుకొని అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.



బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీ ఫామ్‌లు

బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆ పార్టీ సిట్టింగ్ అభ్యర్థులకు సోమవారం బీ ఫామ్‌లు అందజేశారు. ఎన్నికల ఖర్చు కోసం రూ.40 లక్షల చెక్కును సైతం ఇచ్చారు. బీఫామ్ అందుకున్న వారిలో వికారాబాద్, పరిగి, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, రాజేంద్రనగర్, నియోజకవర్గాల అభ్యర్థులు మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి, పి.సబితారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాష్‌గౌడ్ ఉన్నారు. – వికారాబాద్



కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల కార్డును చూపుతున్న రేవంత్‌రెడ్డి

గెలుపు బాధ్యత మీది

ఈ ప్రాంత అభివృద్ధి బాధ్యత మాది

- బీఆర్‌ఎస్ హయాంలో.. జిల్లాకు తీరని అన్యాయం
- 'ప్రాణహిత' డిజైన్ మార్చి జిల్లాకు నీరందిస్తాం
- 'పాలమూరు' పేరుతో కల్లబొల్లి మాటలు
- గోదావరి జలాలు ఈ ప్రాంతానికి రాకుండా అడ్డుకున్నది కేసీఆరే
- వికారాబాద్ బహిరంగ సభలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

వికారాబాద్: బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం రాత్రి వికారాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 2018 ఎన్నికల్లో నన్ను వికారాబాద్ సభలో పాల్గొనకుండా అరెస్టు చేసి ప్రసాద్‌కుమార్ గెలుపును అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఈ సారి జిల్లా నుంచి పోటీ చేస్తున్న ఐదుగురు అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపించి అసెంబ్లీకి పంపాలని ఆయన కోరారు. వికారాబాద్‌లో ప్రసాద్‌కుమార్, పరిగిలో రామ్మోహన్ రెడ్డి, కొడంగల్‌లో నన్ను, చేవెళ్లలో భీంభరత్‌ను, తాండూరులో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాణహిత ప్రాజెక్టు డిజైన్ మార్చి జిల్లాకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. మీరు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి బాధ్యత తీసుకోండి, ఈ ప్రాంత అభివృద్ధి బాధ్యత మేము తీసుకుంటాం అని ప్రజలకు పిలుపునిచ్చారు. పాలమూరు ఎత్తిపోతల పేరుతో కల్లబొల్లి మాటలు తప్ప చేసిందేమీ లేదన్నారు. గోదావరి జలాలు ఈ ప్రాంతానికి రాకుండా అడ్డుకున్నది కేసీఆర్ కాదా..? అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణకు, ప్రధానంగా ఈ ప్రాంతానికి కేసీఆర్ కుటుంబం తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఇక్కడి నుంచే పాదయాత్ర ప్రారంభించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారని గుర్తు చేశారు. నేడు మనం కూడా ఈ ప్రాంతం నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నామని, విజయం సాధించడం ఖాయమన్నారు. కేసీఆర్ హుస్నాబాద్ నుంచి ఎన్నికల సభలు మొదలు పెడితే.. మనం వికారాబాద్ నుంచి ప్రారంభించామని.. కేసీఆర్‌కు హుస్నాబాద్ కలసి వస్తుందో.. మనకు వికారాబాద్ కలసి వస్తుందో త్వరలోనే తెలుస్తుందని అన్నారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాణహిత ప్రాజెక్టును ప్రారంభించి రూ. 11 వేల కోట్లు ఖర్చు చేస్తే కేసీఆర్ దాని డిజైన్ మార్చి ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. అనంతరం మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. నేటికీ కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధే కనిపిస్తోందని, బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదని మండిపడ్డారు. నేను మంత్రిగా ఉన్న సమయంలో రూ. 900 కోట్లతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. నాడు వైఎస్సార్ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ఇందిరమ్మ పాలన అందించారని అన్నారు. నేడు ఆయన ఆత్మ రేవంత్‌రెడ్డిలో పూనిందని ఆయన్ను గెలిపిస్తే మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఆనంద్ అవినీతికి పరాకాష్టగా మారారని విమర్శించారు. సేవ చేస్తున్నానని చెప్పుకునే ఆయన ఏనాడైనా పేదలకు ఉచితంగా వైద్యం చేశాడా అని ప్రశ్నించారు. ఆపరేషన్లకు పైసా తక్కువ కాకుండా వసూలు చేశాడని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజాప్రతినిధులే కాకుండా ఐఏఎస్, ఐపీఎస్‌లు కూడా అవినీతిలో మునిగిపోయారని విమర్శించారు. తనకు ఓటు వేసి ఆశీర్వదిస్తే అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని అన్నారు. అనంతరం మాజీ మంత్రి ఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కేసీఆర్ మొత్తం జూటా.. సోనియమ్మ తెలంగాణ ఇస్తే కేసీఆర్ నమ్మక ద్రోహం చేసిండు. తెలంగాణ ఇచ్చినా లక్ష్యం నెరవేరలేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చి పదేళ్లు అవుతున్నా డబుల్ బెడ్ రూం ఇళ్ల జాడ లేదన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇష్టారాజ్యంగా జోన్లు ఏర్పాటు చేసి తీవ్ర నష్టం చేకూర్చారని మండిపడ్డారు. ప్రజల అభిష్టానికి విరుద్ధంగా జిల్లాను జోగులాంబ జోన్‌లో కలిపితే ఉద్యమించి మళ్లీ చార్మినార్ జోన్ సాధించుకున్నామని గుర్తు చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శులు రఘువీరారెడ్డి, ధారాసింగ్, యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, చేవెళ్ల అభ్యర్థి భీంభరత్, జెడ్పీటీసీ సంతోష, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్ నాయక్, మాజీ జెడ్పీటీసీ మైపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, రాష్ట్ర నాయకులు అనంతసేనారెడ్డి, వహీద్‌మియా, అయూబ్ అన్సారీ, ఎర్రవల్లి జాఫర్, గోవర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నర్సింలు, లక్ష్మణ్, రాజశేఖర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

భారీగా చేరికలు

అనంతగిరి: వికారాబాద్ సభలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముత్తాహర్ షరీఫ్, నాయకుడు రామేశ్వర్ వారి అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. వారికి రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

మీ సేవకుడిగా వచ్చా ఆదరించండి

- సమస్య ఉందని ఫోన్ చేస్తే మీ ఇంటికొస్తా
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- మదన్‌పల్లిలో ఎన్నికల ప్రచారం
- పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: ప్రస్తుత ఎన్నికల్లో నన్ను గెలిపించి.. సమస్య ఉందని ఫోన్ చేస్తే మీ ఇంటికి వస్తానని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మదన్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి మంత్రి మహేందర్‌రెడ్డి కలసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మదన్‌పల్లి తండా, బురాన్‌పూర్, సూర్యానాయక్ తండా, కుభ్యానాయక్ తండా, గట్టిగాని తండా, టేకులగడ్డ తండాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. తనను రెండో సారి గెలిపించాలని కోరారు. రేవంత్‌రెడ్డిలా అమ్ముడుపోయే, కొనుక్కు నే విధానాలు తనకు రావని అన్నారు. మీ సేవకుడిగా వచ్చా.. ప్రజాసేవ చేసి తరిస్తా అని అన్నారు. అనంతరం మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మన పాలన దేశానికే ఆదర్శమన్నారు. నరేందర్‌రెడ్డిని రెండోసారి ఎమ్మెల్యేగా.. కేసీఆర్‌ను మూడో సారి సీఎంగా చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, దేశ్యానాయక్, మహేందర్‌రెడ్డి, యాదగిరి, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

- ఎమ్మెల్యే ఆనంద్
- అనంతగిరిగుట్ట, ఆలంపల్లిలో ప్రత్యేక పూజలు
- పెండ్లిమడుగులో ఎన్నికల ప్రచారం ప్రారంభం



అనంతగిరిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

అనంతగిరి: బీఆర్‌ఎస్ వికారాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సోమవారం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఉదయం అనంతగిరిగుట్ట అనంత పద్మనాభస్వామి ఆలయంలో, ఆలంపల్లి దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెండ్లిమడుగు గ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. స్థానికులు బోనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని తనకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బుచ్చిరెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, కొత్తగడి పీఏసీఎస్ చైర్మన్ సుభాన్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. పట్టణంలోని ధన్నారంలో ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ సబితా ఆనంద్ ఎన్నికల ప్రచారం చేశారు. మరోసారి తన భర్తకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఆమె వెంట కౌన్సిలర్లు రాములు, లంకా పుష్పలతారెడ్డి తదితరులు ఉన్నారు.

పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఎన్నికల విధులపై నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

వికారాబాద్ అర్బన్: రానున్న ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా విధులు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సీ నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులపై నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు జిల్లాస్థాయి ట్రైనర్లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ రోజు ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లపై అందరికీ అవగాహన ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, వికారాబాద్ ఎంపీడీవో సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు



శ్రీనివాస్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ మోసాలను ప్రజలు గుర్తించారు
- నన్ను గెలిపిస్తే పరిగిని ఆదర్శంగా నిలుపుతా
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే పరిగి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలుపుతానని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పరిగి పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పలాద్రి శ్రీనివాస్‌తో పాటు పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే బర్కత్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, రుకుంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయన్నారు. బీఆర్‌ఎస్ మోసాలను ప్రజలు గుర్తించారని, అందుకే కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. నేను సంపాదించుకోవడానికి రాజకీయాల్లోకి రాలేదని, పరిగి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమన్నారు. 40 రోజు లు కష్టపడితే 5 సంవత్సరాలు ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షులు పరశురాంరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రాంరెడ్డి, యాదవరెడ్డి పాల్గొన్నారు.

నువ్వా.. నేనా..!

- కొడంగల్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ హోరాహోరీ పోరు
- ఆత్మ గౌరవం పేరుతో రేవంత్‌రెడ్డి
- అభివృద్ధి మంత్రంతో నరేందర్‌రెడ్డి
- ఇద్దరి మధ్యే ప్రధాన పోటీ





కొడంగల్: ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న కొడంగల్ నియోజకవర్గం ఇక మీదట రాజకీయాలకు వేదిక కానుంది. రాజకీయాల్లో రాటుదేలిన ఇద్దరు నేతలు అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్నారు. అందులో ఒకరు ప్రస్తుత టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి.. మరొకరు ప్రస్తుత ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి. ఈ ఇద్దరి మధ్య ప్రధానంగా పోటీ ఉండబోతుంది. ఇన్నాళ్లు జరిగిన ఎన్నికలు ఒక వంతు అయితే వచ్చే నెలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు మరో వంతు. కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్ రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిలకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. వారిద్దరూ భవిష్యత్ రాజకీయాల కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆత్మగౌరవం పేరుతో రేవంత్.. అభివృద్ధి మంత్రంతో నరేందర్‌రెడ్డి ప్రజల వద్దకు వెళ్తున్నారు. రేవంత్‌రెడ్డి తాను ఎమ్మెల్యేగా ఉన్న 9 ఏళ్ల కాలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలను వివరిస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొడంగల్‌కు చేసింది ఏమీ లేదని ఆరోపిస్తున్నారు. నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో పర్యటిస్తూ పట్టు సాధించారు. గ్రామ గ్రామాన ఆయనకు అనుచరులు ఉన్నారు. మంత్రి కేటీఆర్ కొడంగల్‌ను దత్తత తీసుకొని అధిక మొత్తంలో నిధులు మంజూరు చేశారని చెబుతున్నారు. అభివృద్ధి తమ హయాంలోనే జరిగిందని ప్రజలకు వివరిస్తున్నారు. తనను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో పర్యటించి పార్టీ ఇచ్చిన ఆరు హామీలను ప్రజలకు వివరిస్తున్నారు. ఆరు గ్యారంటీలతో ముందుకు వెళ్తున్నారు. రేవంత్ రెడ్డి మాత్రం బిజీగా ఉండడం వల్ల నియోజకవర్గంలో ప్రచారం చేయడంలో కాస్తా వెనుకబడినట్లు ఆయన అభిమానులు అంటున్నారు. రాష్ట్ర స్థాయిలో పార్టీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి తన దైన ప్రణాళికతో వస్తున్నట్లు కాంగ్రెస్ శ్రేణు లు తెలిపా యి. లేటుగా వచ్చినా లేటెస్టుగా ఉంటుందని చెబుతున్నారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు అలసిపోయిన తర్వాత రేవంత్‌రెడ్డి రంగంలోకి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. రేవంత్ వ్యూహం పకడ్బందీగా ఉంటుందని, అది ఎవరికీ అర్థం కాదని చెబుతున్నారు.బీఆర్‌ఎస్‌ను ఓవర్‌టేక్ చేసే విధంగా రేవంత్ ప్రణాళికలు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికలు ఇద్దరు నేతలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. కొడంగల్ ప్రజలు తనను ఎలాగైనా గెలిపిస్తారని రేవంత్ ధీమాగా ఉన్నారు. కొడంగల్ ప్రజల ఆత్మగౌరవానికి తాను ప్రతీకగా నిలిచినట్లు రేవంత్ బహిరంగంగా చెబుతున్నారు. ప్రజలు తనను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నారని వారి రుణం ఈ జన్మలో తీర్చుకోలేనని పలుమార్లు ఆయన ప్రకటించారు. తాను బతికున్నంత కాలం కొడంగల్‌లోనే ఉంటానని, చనిపోతే తన శవం కూడా కొడంగల్‌కే వస్తుందని ఇక్కడి ప్రజలకు భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

కొడంగల్‌ బరిలో ఎంఐఎం

పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ గుల్షన్‌

కొడంగల్‌ రూరల్‌: అసెంబ్లీ ఎన్నికల బరిలో ఎంఐఎం పోటీ చేస్తుందని పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ గుల్షన్‌ అన్నారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అధిష్టానం త్వర లోనే అభ్యర్థిని ప్రకటిస్తుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికీ తిరుగుతూ పార్టీ సిద్ధాంతాలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండీ.ముర్తుజా, షేక్‌ రోమన్‌, ఎండీ.అర్షద్‌, ఎండీ.ఎజాజ్‌, సయ్యద్‌ ముస్తాఫా, ఎండీ.సర్తజ్‌, ఎండీ.అజర్‌, షేక్‌ ఆబిద్‌, జాఫర్‌ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

వికారాబాద్‌ రిటర్నింగ్‌ అధికారి రాహుల్‌ శర్మ



సమీక్షలో మాట్లాడుతున్న రాహుల్‌ శర్మ

వికారాబాద్‌ అర్బన్‌: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కేటాయించిన విధులను అధికారులంతా సమన్వయంతో నిర్వర్తించాలని వికారాబాద్‌ నియోజకవర్గం రిటర్నింగ్‌ అధికారి రాహుల్‌ శర్మ అన్నారు. సోమవారం ఆయన కలెక్టర్‌ కార్యాలయంలో ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీవీటీ, అకౌంటింగ్‌ టీం, అసిస్టెంట్‌ ఎక్పెండీచర్‌ అబ్జర్వర్లతో ఎన్నికల విధుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ టీంలో ఒక హెడ్‌ కానిస్టేబుల్‌, ఇద్దరు కానిస్టేబుళ్లు, వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీంలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ నర్సింహులు, తహసీల్దార్‌ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బెల్టు షాపుల్లో భారీగా మద్యం నిల్వలు

- పల్లెల్లో పోలీసుల వరుస దాడులు
- జీవన్గీలో రెండోరోజు మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిల్లను చూపుతున్న ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌

బషీరాబాద్‌: ఎన్నికల వేళ పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. బెల్టు షాపుల నిర్వాహకులు ముందగానే భారీ ఎత్తున మద్యం నిల్వలు చేశారు. ప్రధాన పార్టీల నాయకులు ఓటర్లకు క్వాటర్లతో గాలం వేస్తున్నారు. సాయంత్రం అయితే బెల్టు షాపులు మందుబాబులతో కిక్కిరిస్తున్నాయి. బషీరాబాద్‌ మండలంలో మూడు రోజులుగా వరుసగా పోలీసులు దాడులు చేస్తున్నారు. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌ ఆధ్వర్యంలో సోమవారం జీవన్గీలో రెండో సారి దాడులు చేయంగా భారీగా మద్యం పట్టుబడింది. గ్రామానికి చెందిన బోగ రాజు, బాకారం నర్సిరెడ్డి బెల్టు షాపుల్లో పట్టుబడిన మద్యం సీజ్‌ చేసి ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్‌లో ‘విజయ భేరి’ జోష్‌

వికారాబాద్‌లోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయభేరి హస్తం శ్రేణుల్లో జోష్‌ నింపింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభా ప్రాంగణానికి చేరుకోగానే అభిమానులంతా ఒక్కసారిగా ఆయనకు అనుకూలంగా నినాదలు చేశారు. ఆయన ప్రసంగాన్ని గ్రౌండ్‌ బయటున్నవారు సైతం ఆసక్తిగా విన్నారు. ప్రత్యర్థులుగా ఉన్న ఇద్దరు మాజీ మంత్రులు గడ్డం ప్రసాద్‌ కుమార్‌, ఎ.చంద్రశేఖర్‌రావు ఒకే వేదికను పంచుకోవడంతో అభిమానులు సంతోషంగా జైకొట్టారు. అనంతరం మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల సీనియర్‌ నాయకులు వేలాది మంది అనుచరులతో కలిసి కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పీసీసీ అధ్యక్షుడు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అనంతగిరి



ప్రసాద్‌కుమార్‌, చంద్రశేఖర్‌తో కలిసి రేవంత్‌రెడ్డి అభివాదం



సభకు హాజరైన జనం



కొండల్‌రెడ్డికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు

ఆరు గ్యారెంటీల ప్రచారంలో ఉమారెడ్డి

దోమ: కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలందరికీ మేలు చేకూరుతుందని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారెడ్డి అన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని ఐనాపూర్‌లో గడప గడపకు ఆరు గ్యారెంటీలపై ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికార బీఆర్‌ఎస్‌ అహంకారనికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో అధికార బీఆర్‌ఎస్‌ అవలంబిస్తున్న తీరును ప్రజలు వచ్చే ఎన్నికల్లో తిప్పికొట్టాలన్నారు. గ్రామాల్లో పేదలకు ఎన్నో హామీలను ప్రవేశపెట్టి వాటిని అమలు చేయకుండా సీఎం కేసీఆర్‌ మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలతో పాటు వివిధ సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్‌ను ఆదరించి అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, యూత్‌ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్‌, 1వ బ్లాక్‌ అధ్యక్షురాలు సురేఖరెడ్డి, చౌడాపూర్‌ మండల అధ్యక్షురాలు సరిత, మహిళ నాయకురాలు పావని, శివారెడ్డిపల్లి సర్పంచ్‌ టి.నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్‌ చెన్నయ్య, పార్టీ నాయకులు విజయేందర్‌, ఆశన్నగౌడ్‌, మైబయ్య, జాఫర్‌, నల్ల సాయిలు, అంజిలయ్య, మేకలబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఐనాపూర్‌లో ప్రచారం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు సతీమణి ఉమారెడ్డి

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ సీనియర్‌ కార్యకర్త పులి జంగయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు విషయం తెలుసుకున్న ఆయన స్థానిక నేతలతో కలసి మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్‌, ప్రధానకార్యదర్శి హన్మంత్‌ ముదిరాజ్‌, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్‌ బంగ్ల యాదయ్య గౌడ్‌, రిటైర్డ్‌ ఏఎస్‌ఐ అంతిరెడ్డి, మాజీ సర్పంచ్‌ అనంతయ్య, పార్టీ నేతలు శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

- ‘సువిధ’లో ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు
- పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి



మాట్లాడుతున్న కరుణాసాగర్‌రెడ్డి

పూడూరు: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మన్నెగూడ జేకే ఫంక్షన్‌హాల్‌లో వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు తప్పక తీసుకోవాలని సూచించారు. ఇందుకు ఎన్నికల సంఘం సువిధ యాప్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కుల, మతాలను, వర్గాలను రెచ్చగొట్టేలా ప్రకటనలు చేయడం, సామాజిక మాధ్యమాల ద్వారా పోస్టులు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా, బంగారు, వెండి వస్తువులను పంచినా ఎన్నికల నియమావళిని ఉల్లంఘనకే వస్తుందన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని శాంతి భద్రతలకు విఘాతం కల్గించవద్దన్నారు. నవంబర్‌ 30న పోలింగ్‌ సజావుగా సాగేలా ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిగి సీఐ వెంకటరామయ్య, చన్గోముల్‌ ఎస్‌ఐ గిరి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే పైలట్‌ రోహిత్‌ రెడ్డి

తాండూరు టౌన్‌: బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు సైనికుల్లా ఎన్నికల కదన రంగంలోకి దూకాలని ఎమ్మెల్యే పైలట్‌ రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోటివేషనల్‌ స్పీకర్లు గంపా నాగేశ్వరరావు, లక్ష్మణ్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు క్రమశిక్షణ కలిగిన సైనికులన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో సీఎం కేసీఆర్‌ విడుదల చేసిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన పరచాలన్నారు. పోలింగ్‌ తేదీ వరకు నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో ప్రచారంపై దృష్టిసారించాలన్నారు. తెలంగాణాలో ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్‌ అధికారంలోకి రావాలన్నారు. జనరంజక పాలన అందిస్తున్న సీఎం కేసీఆర్‌ నేతృత్వంలో విజయం ఖాయమన్నారు. తాండూరులో తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం మోటివేషనల్‌ స్పీకర్లు గంపా నాగేశ్వరరావు, లక్ష్మణ్‌ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, శ్రమ, ఆత్మవిశ్వాసంతో ప్రచారంలో దూసుకు పోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పక్కన మోటివేషనల్‌ స్పీకర్లు నాగేశ్వర్‌రావు, లక్ష్మణ్‌

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

- అరతులం బంగారు ఆభరణాలు, రూ.21వేల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు
- మరో ఇంట్లో విఫలయత్నం



చిందరవందరగా పడిఉన్న సామగ్రి

తాండూరు టౌన్‌: దసరా సెలవులకు ఊరికి వెళ్లిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. పట్టణ ఎస్‌ఐ అబ్దుల్‌ రవూఫ్‌ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కురవ భీమప్ప దసరా సెలవులకు ఊరికి వెళ్లాడు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి అరతులం బంగారు ఆభరణాలు, రూ. 21వేల నగదును ఎత్తుకెళ్లారు. మరో ఇంట్లోనూ చోరీకి యత్నిస్తుండగా ఇంట్లో వాళ్లు అలికిడి చేయడంతో దొంగలు పారిపోయారు. భీమప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మేకల దొంగలకు రిమాండ్‌

15 జీవాలు, ఇన్నోవా స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్‌: మేకల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సోమవారం ఆదిబట్ల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన ప్రకారం.. బార్కాస్‌కు చెందిన మహ్మద్‌ బిన్‌ సులేమాన్‌ బనార్‌ (23), షేక్‌ హైమద్‌ (27) లతో పాటు మరో ఇద్దరు కలిసి ఇన్నోవా కారులో మేకలు ఎత్తెకెళ్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌ పరిసర ప్రాంతాల్లో 15 మేకలను ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల ఆధారంగా వారిపై నిఘావేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 15 మేకలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనంచేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితులపై గతంలో వివిధ పీఎస్‌లలో కేసులు ఉన్నాయని చెప్పారు. కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు

- పెయింటర్‌కు రిమాండ్‌
- రెండు బైక్‌లు, ఒక ఆటో స్వాధీనం

ఇబ్రహీంపట్నం: జల్సాలకు అలవాటుపడి వాహనాల చోరీలకు పాల్పడుతున్న పెయింటర్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పీఎస్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన ప్రకారం.. యాచారం మండలం గున్‌గల్‌ గ్రామానికి చెందిన మచ్చ మహేశ్‌(41) పెయింటింగ్‌ పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడడంతో వృత్తిలో వచ్చే ఆదాయం సరిపోవడం లేదు. దీంతో వాహనాల చోరీలకు పాల్పడుతున్నాడు. ఇటీవల ఎంబీ నగర్‌లో ఇంటి ఎదుట పార్క్‌ చేసిన బైక్‌ చోరీ అయిందని పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. పోలీసులు మంచాల రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి పారిపోయేందుకు యత్నించాడు. ఆయన్ను పట్టుకుని విచారించగా మరో బైక్‌, ఓ టాటా ఏస్‌ వాహనం చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మహిళపై లైంగిక దాడి

చేవెళ్ల: బస్టాండ్‌లో నిద్రిస్తున్న మహిళపై ఇద్దరు జులాయిలు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన ప్రకారం.. కేశంపేట మండలం కొత్తపేటకు చెందిన 20 ఏళ్ల మహిళ భర్తతో విడాకులు తీసుకుంది. ఆదివారం తల్లిదండ్రులతో గొడవపడి చేవెళ్లలో ఉండే అక్కవద్దకు వచ్చింది. ఆమె ఇంటి వద్ద లేకపోవడంతో ఎటు వెళ్లాలో తెలియక స్థానికంగా కల్లు తాగి వచ్చి బస్టాండ్‌లోనే నిద్రకు ఉపక్రమించింది. ఇది గమనించిన ఇద్దరు జులాయిలు మద్యం మత్తులో ఆమెను వివస్త్రను చేసి అత్యాచారానికి పాల్పడి అక్కడి నుంచి పారిపోయారు. కాసేపటికి బస్టాండ్‌కు వచ్చిన వ్యక్తులు ఆమెను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించి అనిల్‌ కుమార్‌, రాజు అత్యాచారానికి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. వెంటనే బాధితురాలిని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందించారు. సోమవారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితురాలిని వారి కుటుంబసభ్యులకు అప్పజెప్పామన్నారు.

తాండూరు వాసులకు అవార్డులు



అవార్డులతో రాజ్‌కుమార్‌, రామకృష్ణ



అవార్డు అందుకుంటున్న యాదయ్య

తాండూరు టౌన్‌: బహుజన సాహిత్య అకాడమీ వారు తాండూరు పట్టణానికి చెందిన బీసీ ఉద్యమ నాయకుడు కందుకూరి రాజ్‌కుమార్‌, విద్యావంతుడు పర్యాద రామకృష్ణకు జాతీయ స్థాయి అవార్డులు అందజేశారు. సోమవారం ఢిల్లీలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి రాజ్‌కుమార్‌ ఆనంద్‌ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. 30 ఏళ్లుగా బీసీలను సంఘటితం చేస్తూ, వారి సమస్యలపై పోరాటం చేస్తున్న రాజ్‌కుమార్‌కు మహాత్మా జ్యోతి బాపూలే జాతీయ పురస్కారం, అలాగే విద్యారంగంలో కృషి చేస్తున్న పర్యాద రామకృష్ణకు జాతీయ విద్యారత్న పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో బహుజన ఉద్యమ నేత స్వర్గీయ కాన్షీరాం సోదరి స్వర్ణ కౌర్‌, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌ మల్లేష్‌, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

యాదయ్య, శ్రీనివాస్‌కు..

పరిగి: పట్టణానికి చెందిన కోళ్ల యాదయ్య, మంచన్‌పల్లి శ్రీనివాస్‌కు బహుజన సాహిత్య అకాడమీ వారు ఆదివారం అవార్డులు ప్రదానం చేశారు. 15 సంవత్సరాలుగా ప్రజలను చైతన్యం చేస్తున్నందున వీరికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

జోరుగా కలప అక్రమ రవాణా!



పాలేపల్లి శివారులో చెట్లను నరుకుతున్న వ్యాపారులు

పట్టించుకోని అధికారులు

దోమ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరితహార కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలు నాటి సంరక్షిస్తుంటే మరో పక్క కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా పొలాల్లో చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తూ అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. తాజాగా మండల పరిధిలోని పాలేపల్లి శివారులో మూడు రోజులుగా కొందరు వ్యాపారులు అనుమతుల పేరిట రోడ్డు పక్కన చెట్లను కొట్టేస్తున్నారు. ఆ కలపను రాత్రి లారీల్లో లోడ్‌ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ, పోలీసు అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వసతుల లేమి.. ప్రాణాలకు హాని

వైన్స్‌తో ఇన్నాళ్లు మహిళలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. నిబంధనలు పాటించకపోవడంతో తాజాగా మందుబాబుల ప్రాణాలమీదకు తెస్తున్నాయి.

- మూత్ర విసర్జనకు వచ్చి నీట మునిగిన మద్యం ప్రియుడు
- రాత్రి 8గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించని వైనం

పహాడీషరీఫ్‌: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీ నుంచి వాంబే కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని బంగారు మైసమ్మ వైన్‌షాప్‌ కొనసాగుతోంది. అధికారికంగానే కొనసాగుతున్నప్పటికీ.. పర్మిట్‌ హాల్‌లో మూత్రశాలలు లేక మందుబాబులు షాప్‌ ఎదురుగా ఉన్న ఎర్రకుంట చెరువు గట్టున మూత్ర విసర్జనకు వెళ్తుంటారు. దీంతో సాయంత్రం శ్రీరాం కాలనీ పారిశ్రామిక వాడ నుంచి విధులు ముగించుకుని ఇళ్లకు చేరుకునే మహిళలు, పాఠశాలల నుంచి తమ చిన్నారులను ఇళ్లకు తీసుకెళ్లే మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలను పార్కు చేస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే సాధారణ వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. చెరువుకు పూర్తిగా ఇనుప జాలీ కంచె వేసినప్పటికీ.. వైన్స్‌ ఎదుట మాత్రం పది ఫీట్ల మేర జాలీ ఏర్పాటు చేయలేదు. దీంతో మందుబాబులు లోనికి వెళ్లి మూత్ర విసర్జన చేస్తున్నారు. ఈ విషయంలో ఎక్సైజ్‌ అధికారులు, పహాడీషరీఫ్‌ పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని శ్రీరాం కాలనీ, వాంబే కాలనీ వాసులు కోరుతున్నారు.

మూత్ర విసర్జన చేస్తూ..

వైన్స్‌లో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి (బిహార్‌ వాసిగా అనుమానిస్తున్న స్థానికులు) మోతాదుకు మించి మద్యం సేవించాడు. అనంతరం బయటికి వచ్చి మూత్ర విసర్జన చేస్తుండగా చెత్త పైనుంచి చెరువులోకి జారుతుండాన్ని గమనించిన పాన్‌షాప్‌లో పనిచేసే యువకుడు సాయి, వాచ్‌మెన్‌ ఇద్దరు కష్టపడి కాస్త పైకి లాగారు. అయినప్పటికీ పట్టుతప్పి ఆ వ్యక్తి వారి కళ్ల ముందే చెరువులోకి మునిగాడు. అనంతరం సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, ఫైరింజన్‌ ఘటనా స్థలానికి చేరుకుని జల్‌పల్లి కౌన్సిలర్‌ పల్లపు శంకర్‌ ద్వారా జేసీబీ రప్పించి చెత్త, గుర్రపు డెక్కలను తొలగించి గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అంధకారం ఉన్నప్పటికీ అగ్నిమాపక సిబ్బంది రిస్క్‌ తీసుకొని మరీ రాత్రి 8 గంటల వరకు గాలించినా ఆచూకీ లభించలేదు.



చెరువులో మునిగిన వ్యక్తి కోసం గాలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

చేవెళ్ల ‘చేతి’లో అసంతృప్తి



అనుచరులతో చర్చిస్తున్న రాచమల్ల సిద్దేశ్వర్‌



తన కేడర్‌తో సమావేశమైన షాబాద్‌ దర్శన్‌

ధిక్కార స్వరం వినిపిస్తున్న అసంతృప్త నేతలు

- అనుచరులతో రహస్య సమావేశాలు

మొయినాబాద్‌: చేవెళ్ల కాంగ్రెస్‌లో అసంతృప్తి రగులుకుంది. ఎమ్మెల్యే టికెట్‌ ఆశించి భంగపడిన నేతలు భవిష్యత్‌ కార్యాచరణపై చర్చించేందుకు రహస్య సమావేశాలు నిర్వహించారు. సోమవారం మొయినాబాద్‌ మండలంలో ఇద్దరు నేతలు వేర్వేరుగా తమ అనుచరులతో రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారు.

20 ఏళ్లుగా విధేయుడిగా

చేవెళ్ల ఎమ్మెల్యే టికెట్‌కోసం చివరి వరకు ప్రయత్నించిన రాచమల్ల సిద్దేశ్వర్‌ చిలుకూరు రెవెన్యూలో ఉన్న తన ఇంట్లో సోమవారం మధ్యాహ్నం తన అనుచరులతో రహస్యంగా సమావేశమయ్యారు. ఇరవై ఏళ్లుగా పార్టీకి విధేయుడిగా ఉంటూ సేవలందిస్తున్నా అధిష్టానం గుర్తించకపోవడంతో ఒకింత ఆగ్రహంగా ఉన్నారు. తనను కాదని ఐదేళ్ల క్రితం పార్టీకి వచ్చిన నేతకు టికెట్‌ కేటాయించడం సరికాదని.. ఏది ఏమైనా చేవెళ్ల బరిలో దిగాల్సిందేనని అనుచరులతో చెప్పినట్లు సమాచారం.

ఎమ్మెల్సీ ఇవ్వాలి

మొయినాబాద్‌కు చెందిన షాబాద్‌ దర్శన్‌ సోమవారం తన అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కనకమామిడి రెవెన్యూలోని ఓ ఫాం హౌస్‌లో సమావేశం నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే టికెట్‌కోసం దర్శన్‌ చివరి వరకు ప్రయత్నం చేశారు. కాంగ్రెస్‌ అధిష్టానం షాబాద్‌ దర్శన్‌ను గుర్తించి ఎమ్మెల్సీ ఇవ్వాలని.. లేదా ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని సమావేశంలో పాల్గొన్న అనుచరులు, కార్యకర్తలు డిమాండ్‌ చేసినట్లు తెలిసింది. చేవెళ్ల టికెట్‌ దక్కకపోవడంతో ధిక్కార స్వరం వినిపిస్తున్న నేతలను హైకమాండ్‌ ఎలా బుజ్జగిస్తుందో అనే చర్చ సర్వత్రా వినిపిస్తోంది.